కథాకాలం : 1987

# సైకోకాకులు

ఉమ్మడి కుటుంబంలో పెళ్ళి కెదిగిన అమ్మడికి అడుగడుగునా జాగ్రత్తలు చెప్పేవాళ్ళెక్కువ. పైట జారిపోకుండా జాకెట్టుకి పిన్ను పెట్టుకోమంటుంది వదినగారు. "ఏవిటలాగ పొద్దంతా దిక్కుమాలిన నవలలు చదవకపోతే కాస్త పనీ పాటా నేర్చుకోరాదూ. ఏముంటుందా పుస్తకాల్లో ప్రేమించుకోడాలూ లేచిపోవడాలూ ఇంతేగా?" అంటుంది తల్లి. కూతురుకేసి చూసినప్పుడల్లా దొడ్లో అరటిచెట్టుకి కాసిన గెల దొంగలెవరైనా ఎత్తుకు పోతారేమోననే భయంతో "ఆ కిటికీ దగ్గర నిలబడిచావక దొడ్లో అరటి చెట్టుకి బోదెలు త్రవ్వు" అని పురమాయిస్తాడు తండ్రి. జాకెట్‌లోంచే బ్రా పట్టీ బైటికొచ్చినందుకు చెవిలో రహస్యంగా పళ్ళు కొరుకుతుంది అక్క. పండక్కి పబ్బానికి వచ్చే బావగారు "అమ్మడుకి నెంబర్ వన్ సంబంధం చూసే ప్రయ

త్నంలో ఉన్నాను. అయినా అమ్మడోయే అల్లుదొద్దు. కాస్త సంగీత మనీ, డాన్సుఅనీ ఏదైనా నేర్చుకున్నావా''అని మామిడిపండు పిసుకుతూ ప్రశ్న వేసినట్టు పలకరిస్తాడు. బుగ్గని సొట్టలు పడ్డప్పుడల్లా ''అస్తమానూ అలా నవ్వడం ఎందుకు, ఓ వయసు వచ్చిన తరవాత ఆడపిల్లలు అయిన్దానికీ కానిదానికీ పడీ పడీ నవ్వుతుంటే అనర్థం" అని ఆడతనం గురించే డూస్ అండ్ డోంట్స్ చెబుతుంటాడు అన్నగారు.

కామిని ఉమ్మడి కుటుంబంలో అమ్మడే. అప్పుడెప్పుడో కొబ్బరాకుల చాపమీద కూచోబెట్టి మూడురోజుల తరవాత లెమ్మన్నారు. అప్పటినుంచి కామినికి ఇంట్లోవాళ్ళు జాగ్రత్తలు చెప్పడం ఎక్కువైంది. తన ప్రతీ కదలికనీ కొన్ని కళ్ళు పరీక్ష చేస్తున్నాయని కామినికి తెలిసిపోయింది. శరీరంలో వచ్చిన మార్పులు తల్లిదండ్రుల ముందూ అక్కబావల ముందూ ఆఖరికి అన్న తమ్ముళ్ళముందు కూడా స్వేచ్ఛగా తనని ఉండనివ్వటంలేదని కామిని అనుమానం. కొత్తలో మరోలా ఆలోచనలు వచ్చేవి తనకేదో అవుతోందని, తను హఠాత్తుగా అందంగా ఉండడం మానేసిందని.

"అవును కిటికీదగ్గర తను ఎందుకు నిలబడకూడదూ, ఎవరైనా చూసి అసహ్యించుకుంటారనే"

''తను ఎందుకు నవ్వకూడదూ, నవ్వితే ఏడిసినట్టుంటాననే"

ఇలాంటి అనుమానాలు మొదలై తనను తాను అసహ్యించుకోడం ప్రారంభించింది కామిని.

కళ్ళకి కాటుక పులుముకుంటుంది. తలలో పేలని పట్టిగ్గా వేటాడు

తుంది. నడుమ రెండు పొట్టలుగా తయరయ్యేలా లోపలి లంగాకి బీట ముడి వేస్తుంది. నుదుటిమీద దోసగింజబదులు రూపాయి అద్దుతుంది.

అన్నిటికీ మించి అనవసరంగా సిగ్గుపడటం ఒకటి. ఇంట్లోవాళ్ళ ముందుకూడా కదలికలు కంట్రోలు చేసుకుంటుంది. నడిచినా మాట్లాడినా అతి జాగ్రత్తకిపోయి తత్తరపాటు ప్రదర్శిస్తుంది.

వో రోజు తాతగారు మెచ్చుకున్నారు. "ఆ అణకువ....ఆ కుదురూ.... అచ్చం మీ బామ్మ పోలికేనే నువ్వు" అని.

జాగ్రత్తలు చెప్పే పెద్దలంతా తాతయ్యగారి సర్టిఫికెట్ గురించి కంచాల దగ్గర కబుర్లలో గర్విస్తూ ఉంటారు. పెళ్ళయ్యేదాకా ఆ పిల్ల వట్ల వాళ్ళకదే బాధ్యత తెలిసిన వ్యవహారం, బాధ్యత తెలిసినకుటుంబం.

ఓ రోజు -

ఇంట్లో అంతా శంకరాచార్య దర్శనానికి పోయారు. అందరికీకొంచెం భక్తిపాలు ఎక్కువ, దానికీతోడు పక్కింటివాళ్ళ గోడ తగాదా కోర్టు కేసొకటి వచ్చింది. ఆపైన కామిని పెళ్ళికెదిగి ఏ దేవుడుమనిషి వచ్చినా వదలటంలేదు ఈమధ్య. భక్తి ఆ ఇంటి గోడలమధ్య ద్రవ్యోల్బణాన్ని కూడా పెంచింది. పూజలనీ పునస్కారాలనీ భజనలనీ నోట చెలామణీ పేట్రేగిపోయింది. కామినికి పెళ్ళయ్యేదాకా ఆ ద్రవ్యోల్బణాన్ని ఎలాగయినా తట్టుకోదలచారు.

కామినికి ఆరోజు అంతా ఏకాంతం దొరికింది. స్టవ్వు వెలిగించి పుల్లట్లు వేసుకుని నాలుగు తను తిని రెండు తమ్ముడు వెధవకిచ్చింది.

ఇద్దరూ కలిసి గెల వేయాల్సిన అరటిచెట్టుకి బోదెలు తవ్వడం ప్రారంభించారు.

ఆ సన్నివేశంలో ఎలాగూ బాగుండనక్కర లేదన్నట్టు కామిని జారిన పైటని అలాగే ఒదిలేసింది. బోదె తవ్వడానికి వీలుగా పరికిణీ గోచె పోసి కట్టడంతో కూర్చున్నప్పుడు రెండు తొడలూ మోకాలుదగ్గర ముగ్గతేలాయి. అక్కడ చిమ్ముకొస్తున్న పసిమి.

ఉన్నట్టుండి తమ్ముడు వెధవ 'అక్కా నువ్ భలే బాగున్నావ్' అన్నాడు.

కామినికి హఠాత్తుగా సంతోషం వేసింది. తరవాత కలవరం కలిగింది పెద్ద అబద్ధం విన్నప్పుడులా!

ఆ తరవాత కోపం వచ్చింది. "ఛీ వెధవా" అని తిట్టి "బోదెలో నీళ్ళుపొయ్యి వెధవా" అని పురమాయించింది. తమ్ముడి పేరు రామం.

వాడు హఠాత్తుగా కామిని పరికిణీని మోకాలి కిందకి లాగాడు.

కామిని హడలి పోయింది.

"ఛీ ఆయన చూస్తున్నాడు" అని సంజాయిషీ చెప్పుకున్నాడు రామం.

తలెత్తి చూసింది గోడవతలకి.

పక్కింటి జోగులు.

తమ్ముడు వెధవగూడా తనలో మొదలైన 'అనర్హత' గమనించి తనకి జాగ్రత్త చెప్పినందుకు కామినికి ఎందులోనైనా దూకి చచ్చిపోవాలనిపించింది.

రామం కొంచెం చురుకైనవాడు. మొన్నటిదాకా వాడికి అక్కే నీళ్ళు పోసేది. అన్నం పెట్టేది. హోమ్ వర్క్ చేయించేది. అన్నీ. అకస్మాత్తుగా స్నేహితురాల్లా ఉండడం మానేసినందుకు వాడికిబాధగా ఉంది.

వాడిముందే పెద్దవాళ్ళంతా ఆమెకి జాగ్రత్తలు చెబుతుంటారు. ఆమెలో వచ్చిన పెద్దరికం ఆమెకిగానీ, తనకిగానీ, ఇంట్లో వాళ్ళకిగానీ సుఖంగాలేదని అర్థంచేసుకున్నాడు రామం. కామినిలో వచ్చిన శారీరక మార్పు ఇప్పుడు రామానికి శత్రువు. శత్రువుమీద ఉండే ఇన్వర్టెడ్ గ్లామర్లాంటిది ఆమె శరీరంమీద అతనికి కలిగింది.

''నువ్వు అందంగా ఉంటావు'' అని చెబితే ఇద్దరి మధ్యా కొత్తగా మొదలైన దూరం చెరిగిపోతుందనీ ఇదివరకులా మళ్ళీ స్నేహంగా ఉండొచ్చనీ వాడి ఆశ. అంతలో పక్కింటి జోగులు వాడి కళ్ళలో పడ్డాడు.

జోగులుకూడా కామినితో స్నేహం కోరుతున్నాడని జోగులు కళ్ళ కేసి చూస్తే రామానికి అనుమానం కలిగింది. ఖచ్చితంగా కామిని శరీరం జోగులు చూపులో ఆకలికి కారణం. అందుకే చటున అక్క పరికిణీని మోకాళ్ళకిందికి రామం లాగేశాడు.

(ఇదంతా ఇంత స్పష్టంగా వాడి గుండెలో కదిలింది - జరిగింది - కాని ఈ భాషలో కాదు)

కామిని అరటి చెట్టుకి బోదెలు త్రవ్వే కార్యక్రమం మధ్యలో ముగించి నీళ్ళు పొయ్యమని రామాన్ని పురమాయించి ఇంట్లోకి వెళ్ళిపోతూ గోడ వతల జోగులుని వాలుచూపు చూసింది.

జోగులు సహజంగా నవ్వబోయి ఏదో అపసవ్య రసాయనిక క్రియకి లోనయినట్టు కన్ను కొట్టి అందుగురించి వెంటనే భయపడిపోయి లోప లికి వెళ్ళిపోయాడు.

తనను తాను కించపరచుకుంటుంది కనుక కామినికి జోగులుమీద కోపం కలగలేదు. పక్కమీద పడుకొని ఏడ్చింది.

పెద్దవాళ్ళ జాగ్రత్తలు గుర్తొచ్చాయి. వాళ్ళు లేని సమయంలో తనకి జరిగింది అపకారం కాకపోయినా అవమానం. అవును. ఆమెకి భయం వేసింది. జరిగిన సంగతి పెద్దవాళ్ళకి చెప్పెయ్యాలి. చెప్పడం వల్ల తనగురించి తను జాగ్రత్తలు తీసుకొంటున్నట్లు పెద్దవాళ్ళకి రుజు వవుతుంది. బాగానే ఉంది. కాని బాగానూ లేదు.

"కొంపలో ఎవరూ లేని సమయంలో అరటిచెట్టు దగ్గర ఎందుకు తచ్చాడావు?" అని పెద్దాళ్ళు కేకలేస్తారు. దోషిని చేస్తారు.

ఆలోచిస్తే ఆమెకి ఒక రహస్యం లాంటిది తెలిసింది.

మగవాళ్ళందరూ తప్పులు చెయ్యడానికే పుట్టారు. అందుచేత శరీరం విషయంలో తను జాగ్రత్తగా ఉండాలి.

కొందరు మగవాళ్ల తప్పులు చెయ్యనివాళ్ల వారు. వాళ్ల తను జాగ్రత్తగా లేకపోవడంవల్ల తప్పులు చేస్తారేమో.

పెద్దవాళ్ళ ఆలోచన అదే.

వెరసి మగవాడు ఎలా ఉండాలో ఆదది నిర్దేశించలేదని లీలగా తోచింది. ఆడదాన్ని ఎవరైనా నిర్దేశించడానికి కూడా ఆ ఆలోచనే కారణం. అందుకే అమ్మ, నాన్న, వదిన, బావగారు, అన్న అందరూ

తనని పరీక్షిస్తూ ఉంటారు. జాగ్రత్తలు చెబుతూవుంటారు. ఇందాకా తమ్ముడుకూడా....

తనకంటే చిన్నవాడు. వాడిమీద కోపం రాలేదు. ప్రతిఘటనకి కేంద్ర బిందువయిన ఆగ్రహం ఆమెలో లేదు. అది బలవంతానికి హరించింది.

రామం అరటిచెట్లకి నీళ్లు పోశాడు.

శరీరం మట్టికొట్టుకుపోయివుంది.

అలాగే ఇంట్లోకి అడుగుపెడితే పెద్దాళ్లు తిట్టిపోస్తారు. బావి దగ్గర స్నానం చేసి వెళ్ళాలి.

కానీ ఇంట్లో ఇప్పుడు పెద్దాళ్ళులేరు. అక్కఉంది. ఇంకా పెద్దాళ్ళలో పూర్తిగా చేరలేదు. ఇదివరకులా అక్క తనకి నీళ్లు పోస్తుందా! ఈమధ్య కొంచెం అందంగా తయారైందికనక పొయ్యదా! తేల్చుకోవాలి.

తిన్నగా లోపలికి వెళ్ళి అక్క మంచం ఎదురుగా నిలబడ్డారు.

మంచంమీద అక్క పొర్లుతోంది. కళ్లు ఉబ్బివున్నాయి.

"అక్కా! నీళ్లు పొయ్యవా?'' బెదురుతూ అడిగాడు.

వాడి ఒళ్లంతా మట్టి మశానం.

వెధవ బుంగమూతీ వాడునూ, కామినికి వాణ్ణి చూస్తే నవ్వొచ్చింది.

"నడు వెధవా బావి దగ్గరకి"- అని రెక్క పుచ్చుకుని లాక్కెళ్లింది. లాగు విప్పి చేదతో నీళ్ళు తోడి గుమ్మరించింది నెత్తిమీద. ఒళ్లంతా కడిగి సబ్బుతో రుద్ది తుండుగుడ్డ ఇచ్చింది. గోరింటాకు పెట్టుకున్న

ఆ చేతికేసి చూస్తూ రామం మొట్టమొదటిసారి అందాన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు. కామిని లోపలికెళ్ళి తిరిగొచ్చి "ఈ కాయితం జోగులుకు ఇయ్యి. ఎవరికీ చెప్పొద్దేం" అని ఓ చీటీ రామానికిచ్చింది.

'ఓ' అంటూ రామం తుండుగుడ్డ మొలకి చుట్టుకొని గోడెక్కి జోగులు వాటా వైపు దూకేసాడు.

ప్రతిఘటన అంటే తెలియకుండానే కామిని తిరుగుబాటు చేసింది ఇంట్లో వాళ్ళమీద. ఫలితం - భంగపాటు - అల్లరవడం॥

పెళ్ళయి పిల్లలున్నవాణ్ణి ప్రేమించిన కామిని వ్యవహారం విని చుట్టుపక్కల పెద్దవాళ్ళంతా తమ కూతుళ్ళకి, మనవరాళ్ళకి, కోడళ్ళకి, ఇంకా ఇంకా తటస్థపడిన స్త్రీ జనానికి మరి కొంచెం ఎక్కువ మోతాదులో జాగ్రత్తలు చెప్పడం మొదలుపెట్టారు.

రామం కొంచెం పెరిగి పెద్దవాడయింతరవాత ఆడపిల్లలు జాగ్రత్తపడాల్సిన మగపిల్లాడయ్యాడు.

జోగులుకి తనద్వారా లవ్‌లెటర్స్ పంపిన కామినే వాడికి ప్రతి ఆడపిల్లలో కనిపిస్తోంది! జాగ్రత్! జాగ్రత్॥